సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 17 । నవంబర్ । 2024



తక్కువ రేటుకే బంగారమంటూ..

తక్కువ ధరకే బంగారం పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రూ.16 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



స్వాములకు భిక్ష భాగ్యంగా..

మండల దీక్షలు సందర్భంగా ఊరూరా అయ్యప్ప మాలధారులకు భక్తులు ఉచిత అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేస్తూ స్వామి సేవలో తరిస్తున్నారు. 8లో ▸



ఉత్సాహంగా జోనల్ పోటీలు

జోన్–2 బాలికల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఫైనల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల క్రీడాకారులు తలపడ్డారు. 8లో ▸

న్యూస్‌రీల్

108 ఉద్యోగుల సమ్మె నోటీసు



ఆర్డీఓకు నోటీసు ఇస్తున్న ఉద్యోగులు

నరసాపురం: 108 ఉద్యోగులు శనివారం నరసాపురం ఆర్డీఓ దాసి రాజును కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25 నుంచి సమ్మె తలపెట్టినట్టు చెప్పారు. 108 సర్వీస్‌ను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, వాహనాల్లో పనిచేస్తున్న ఈఎంటీ, పైలెట్‌లకు రూ.40 వేల వేతనం అందించాలని, తమను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వేతనాలను ప్రతినెలా 5లోపు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగులు ఎ.రాజేష్, బి.శ్యామ్ పాల్గొన్నారు.

రేపు రక్తదాన కేంద్రం ప్రారంభం



రాయలంలో రెడ్‌క్రాస్ భవనం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భీమవరం రాయలంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతనంగా నిర్మించిన బ్లడ్ సెంటర్‌ను సోమవారం ప్రారంభిస్తామన్నారు. అత్యాధునిక సదుపాయాలతో జిల్లాలో ఆస్పత్రులకు స్థిరమైన, సురక్షిత రక్తాన్ని అందించే లక్ష్యంతో ఏర్పాటు చేశామన్నారు.

ఇసుక ఇబ్బందులు తొలగించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఇసుక లోడింగ్‌లో ఇబ్బందులను తొలగించేందుకు రవాణాదారులు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలో ట్రాన్స్‌పోర్టర్లతో ఆమె సమావేశమయ్యారు. ఏ రీచ్‌కు ఎన్ని వాహనాలు పంపుతున్నారు, వాహనం నంబర్, డ్రైవర్ నంబర్ తదితర వివరాలు ఇసుక ఫెసిలిటేషన్ సెంటర్‌కు అందజేయాలని సూచించారు. రీచ్‌లో ఇసుక లోడింగ్‌లో సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. ఈనెల 4 నుంచి ఇప్పటివరకు 654 వాహనాల ద్వారా 14,100 టన్నుల ఇసుకను తూర్పుగోదావరి జిల్లా నుంచి జిల్లాకు తరలించామన్నారు. జిల్లాలో వినియోగదారులకు ఇసుక అందుబాటులోకి వచ్చిందన్నారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు, జిల్లా లారీ యూనియన్ అధ్యక్షుడు రావూరి రాజా, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శిరిగినీడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో విస్తృత సేవలు



సహకార వారోత్సవాల్లో పాల్గొన్న జేసీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, సహకార సంఘాలు విస్తృత సేవలు అందిస్తున్నాయని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో జరిగిన కార్యక్రమంలో ఆమె సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ సకాలంలో పూర్తిచేయాలన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, పీఏసీఎస్‌లు సమన్వయంతో పనిచేసి డీసీసీబీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. జిల్లా సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కంప్యూటరీకరణ, పరపతేతర వ్యాపారం చేయడం ద్వారా జిల్లాలోని ప్రతి సహకార సంఘానికి కామన్ సర్వీసు కేంద్రాలుగా గుర్తింపు తీసుకువచ్చామని, తద్వారా రైతులకు బహుళ సేవలు అందించి ఏలూరు జిల్లాను ప్రగతి పథంలోకి తీసుకురాగలమన్నారు. డీసీసీబీ సీఈఓ తిలక్ నారా మాట్లాడుతూ తమ బ్యాంకు ఆర్థిక గణాంకాలు, ప్రణాళికలు, బ్యాంకు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తామన్నారు. సహకార వారోత్సవాల ఇన్‌చార్జ్ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ వికసిత భారత నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్థిరమైన జీవనోపాధి సృష్టించడానికి, వారి ఆర్థిక అభివృద్ధికి కీలకంగా వ్యవహరించాలని కోరారు. బ్యాంకు ఉద్యోగులు సహకార గీతాలాపన చేసి సహకార ప్రతిజ్ఞ చేశారు.

సచివాలయం.. సేవలు నిర్వీర్యం

గ్రామ స్వరాజ్యంపై కూటమి కక్ష

- సచివాలయ వ్యవస్థపై నిర్లక్ష్యపు నీడలు
- నిర్వీర్యానికి ప్రభుత్వం ఎత్తుగడలు
- అలంకారప్రాయంగా కార్యాలయాలు
- నామమాత్రంగా సిబ్బంది హాజరు
- గతంలో 139 సేవలు.. ప్రస్తుతం 75 శాతం సేవలు రద్దు



ఏలూరు మండలంలో శనివారపుపేట-1 గ్రామ సచివాలయం

ఉమ్మడి పశ్చిమలో ఇలా..	
గ్రామ సచివాలయాలు	938
వార్డు సచివాలయాలు	207
మొత్తం సిబ్బంది	9,555



గత ప్రభుత్వంలో నిరంతరాయంగా సేవలందిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఏలూరు (టూటౌన్): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కళకళలాడిన గ్రామ, వార్డు సచివాలయాలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. ప్రజల వద్దకు పాలన, గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా మాజీ సీఎం జగన్ తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ మనుగడపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యపు నీడలు కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సచివాలయాల పరిస్థితి చూస్తే ఇది అర్థమవుతుంది. సచివాలయాల సేవలకు క్రమంగా ప్రజలు దూరమవుతున్నారు. గతంలో 139 రకాల సేవలను సచివాలయాల ద్వారా అందించగా ప్రస్తుతం 75 శాతానికి పైగా సేవలు దూరమయ్యాయి.

వైఎస్సార్‌సీపీ మానస పుత్రికగా..

గతంలో ప్రజలు చిన్నపాటి సేవలకు సైతం మండల కేంద్రం, మున్సిపల్ కార్యాలయం, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో వారికి వ్యయప్రయాసలు తప్పేవి కావు. ఈ నేపథ్యంలో ప్రజల ముంగిళ్లలోకే సేవలందించేలా 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా సేవలందించింది. దీనిపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రతి సచివాలయంలో 11 మంది వరకు సిబ్బందిని నియమించి సుమారు 139 రకాల సేవలు స్థానికంగా అందించేలా చర్యలు తీసుకుంది. విద్యార్థులకు ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఉద్యోగార్థులకు ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వంటి సర్టిఫికెట్లు, రైతులకు రిజిస్ట్రేషన్ సేవలు, రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేర్పులు, ఆధార్ సేవలు, పింఛన్ల నమోదు తదితర సేవలు నిరంతరంగా సాగాయి. అయితే ప్రస్తుతం పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.

నాడు కళకళ.. నేడు వెలవెల

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల్లో నామమాత్రంగా సేవలు అందుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిబ్బందిని ఇతర పనులకు వినియోగిస్తుండటంతో సచివాలయంలో గ్రామ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ వంటి వారు మాత్రమే ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలకు అత్యవసరమైన ఆధార్ సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం విద్యార్థుల వివరాలను కేంద్ర ప్రభుత్వం ఆపార్ కార్యక్రమంలో అప్‌డేట్ చేస్తుండటం, విద్యార్థుల ఆధార్, స్కూల్ రికార్డుల్లోని వివరాల్లో తేడాలు ఉండటంతో వాటిని సరిచేసేందుకు తల్లిదండ్రులు దూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తోంది.

క్రమంగా ప్రాభవాన్ని కోల్పోతూ..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం సచివాలయాలు 1,145 ఉండగా వీటి పరిధిలో 9,555 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లాస్థాయిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మానిటరింగ్ అధికారిగా ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో కమిషనర్, మండల స్థాయిలో మండల పరిషత్ అధికారి సచివాలయాలను అజమాయిషీ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు వరకూ సమర్థవంతంగా పనిచేసిన సచివాలయాలు క్రమంగా తమ ప్రాభవాన్ని కోల్పోతుండటం సచివాలయ ఉద్యోగుల్లోనూ ఆందోళన కలిగిస్తోంది. కొందరిని వారి మాతృ సంస్థలకు పంపుతారనే వార్తలు వస్తుండటంపై ఉద్యోగుల్లో నిర్లిప్తత కనిపిస్తోంది.

అన్ని సేవలూ అందించాలి



గతంలో సచివాలయాల ద్వారా ప్రజలకు అందించిన అన్ని సేవలను ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ అందించాలి. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల కోసం నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసే బాధలు తప్పాయి. అర్హత ఉండి సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ పథకాలు అందించారు. దీని వల్ల ఎందరో పేదలు లబ్ధి పొందారు.

– కింజంగి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నాయీబ్రాహ్మణ సంఘం, ఏలూరు

పటిష్టం చేయాలి



గతంలో మాదిరిగా గ్రామ, వార్డు సచివాలయాలను పటిష్టం చేయాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులో ఉంచిన అన్నిరకాల సేవలను యథావిధిగా కొనసాగించాలి. ప్రజల వద్దకే పాలన, గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలి. ఇటీవల సచివాలయ ఉద్యోగులను బదిలీ చేయగా.. కొన్నిచోట్ల ఖాళీలు ఉన్నాయి. నిత్యం ఆధార్ అప్‌డేట్‌కు సచివాలయాల్లోనూ అవకాశం కల్పించాలి.

– డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం, ముప్పవరం

గ్రీవెన్స్ ఫిర్యాదులను పరిష్కరించాలి

మున్సిపల్ ఆర్డీ నరసింహారావు



ఏలూరు కార్పొరేషన్‌లో అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీ నరసింహారావు

ఏలూరు (టూటౌన్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రాజమహేంద్రవరం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ కమ్ అప్పిలేట్ కమిషనర్ నాగనరసింహారావు ఆదేశించారు. శనివారం ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం జిల్లాలోని నగరపాలక సంస్థ, పురపాలక సంఘ, నగర పంచాయతీ కమిషనర్లు, సిబ్బందితో పీజీఆర్ఎస్, రెవెన్యూ వసూళ్ళు, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల వినియోగం, పాట్ హోల్స్ ఫ్రీ రోడ్స్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా అందే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని, ప్రజల నుంచి పౌర సౌకర్యాల సమస్యలపై అందే అర్జీలను పరిష్కరించాలన్నారు. పట్టణ పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన మేరకు గుంతలు లేకుండా రోడ్లు మరమ్మతులు చేయించాలన్నారు. ఆస్తి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ఏలూరు నగర కమిషనర్ ఎ.భాను ప్రతాప్, ఏలూరు అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, ఏలూరు డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి, చింతలపూడి మున్సిపల్ కమిషనర్ టి.పావని, జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరమణ, నూజివీడు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని నిర్బంధ కాండ

సోషల్ మీడియా యాక్టివిస్ట్ సుందర్ అరెస్ట్



సుందర్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

ఉండి : వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు, యాక్టివిస్టులపై ప్రభుత్వ అక్రమ కేసులు కొనసాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, లీగల్ సెల్ నియోజకవర్గ కన్వీనర్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఉణుదుర్రుకి చెందిన గొర్రుముచ్చు సుందర్‌కుమార్‌ను శనివారం అరెస్టు చేసి ఉండి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మాండ్రు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. సుందర్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫేస్‌బుక్‌లో వివిధ పోస్టులు పెట్టిన కారణంగానే అరెస్టు చేశామన్నారు. ఆయన ఫోన్‌ను స్వాధీనపరచుకుని, పలు పోస్టులను సేకరించి వాటి విషయంలో కేసు పెట్టామన్నారు. సుందర్‌కుమార్‌పై పోలీసులు 241, 196, 356, 353, 66 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. సాయంత్రం సుందర్‌కుమార్‌ను కోర్టుకు తరలించగా, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్టు సీఐ జగదీశ్వరరావు చెప్పారు.

హామీలను నెరవేర్చాలని అడగడం తప్పా!

సుందర్‌కుమార్ అరెస్టును వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడగడం తప్పా అంటూ ప్రశ్నిస్తున్నారు. సూపర్‌సిక్స్ ఎప్పుడు అమలు చేస్తారని రాష్ట్ర ప్రజలంతా అడుగుతున్నారని, వారందరినీ అరెస్టు చేస్తారా అంటూ నిలదీస్తున్నారు. సుందరకుమార్ అరెస్టు వార్త తెలిసి పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. హామీలను పక్కదారి పట్టించుకునేందుకే అక్రమ అరెస్ట్‌లు అంటూ మండిపడ్డారు.

ముసుగు పడింది



మహాలక్ష్మిచెరువు గ్రామంలో కూటమి నాయకుల ఫ్లెక్సీకి బరకాలు కప్పుతున్న దృశ్యం

సాక్షి స్పందన

తణుకు టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై శనివారం 'సాక్షి' పత్రికలో 'ఎన్నికల కోడ్ ఉల్లంఘనులు' శీర్షికన ప్రచురించిన కథనానికి మండల అధికారులు స్పందించారు. తణుకు రూరల్ మండలంలోని దువ్వ, తేతలి, కొమరవరం, మహాలక్ష్మీ చెరువు తదితర గ్రామాల్లో పర్యటించి రాజకీయ నేతల ఫ్లెక్సీలను తొలగించడం, మరికొన్నింటిని వెనక్కి తిప్పడం, బరకాలు కప్పడం వంటి చర్యలు చేపట్టారు.

మినీ అంగన్‌వాడీల ఆవేదన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్ వద్ద శనివారం జిల్లాలోని మినీ అంగన్‌వాడీ వర్కర్లు వారి సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ ఝాన్సీలక్ష్మి, సెక్రటరీ డి.కల్యాణి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఇక్కడ ధర్నా చేశామన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జీఓ ఇవ్వాలని, వర్కర్లకు పదోన్నతులు, వేసవిలో సెలవులు, మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. గ్రేడ్–2 సూపర్‌వైజర్ పోస్టులకు తమకు కూడా అవకాశం కల్పించాలని, మట్టి ఖర్చులు ఇవ్వాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశామన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మినీ అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ


భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బీసీ సంక్షేమ అధికారి గణపతిరావు తెలిపారు. ఉచిత శిక్షణతోపాటు స్టయిఫండ్, స్టడీ మెటీరియల్ ఇస్తామని, ఈనెల 22వ తేదీలోపు భీమవరం కలెక్టరేట్‌లోని తమ కార్యాయలంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వివరాలకు సెల్ 82473 68943, 81066 77598 నంబర్లలో సంప్రదించాలని గణపతిరావు కోరారు.

అన్నదానం.. అవకతవకలే నిత్యం

- టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో క్షీరారామంలో కార్తీక నిత్యాన్నదానం
- భక్తుల విరాళాలు సొంత ఖాతాలకు..
- జమాఖర్చుల వివరాలు తెలపని వైనం
- ఆహార పదార్థాల్లో నాణ్యతాలేమి
- సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత
- గత ప్రభుత్వంలో పక్కాగా అమలు



సొంత రశీదుల ద్వారా విరాళాలు సేకరిస్తున్న టీడీపీ నేత



ప్రైవేట్ వ్యక్తి పేరున డిజిటల్ విరాళం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం)లో నిత్యాన్నదాన నిర్వహణపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత రెండేళ్లుగా ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా.. ఈ ఏడాది రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తెలుగుదేశం పార్టీ నేతలు కొందరు అన్నదానం నిర్వహణకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో గత 15 రోజులుగా పట్టణంలోని రేపాక వారి సత్రం (దేవాదాయశాఖ)లో ఆలయం పేరిట జరుగుతున్న నిత్యాన్నదానంలో అవకతవకలు చోటుచేసుకుంటున్నట్టు టీడీపీకి చెందిన మరికొందరు నేతలు, ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై నియోజకవర్గ మంత్రి వద్ద కూడా చర్చ జరిగినట్టు తెలిసింది. భక్తుల నుంచి విరాళాలు సేకరించి ఆ మొత్తంతో ఇక్కడ అన్నదానం నిర్వహిస్తుండగా.. విరాళాల సేకరణకు సొంత రశీదులు ఇవ్వడం, జమాఖర్చులు వివరాలు తెలపకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అలాగే వారం క్రితం ఉదయం అన్నదానంలో మిగిలిపోయిన రైస్‌ను సాయంత్రం సాంబారు కలిపి ప్రసాదం అని పంపిణీ చేయడంపైనా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

2016లో కమిటీ ఏర్పాటు

2016లో టీడీపీ కౌన్సిలర్లు దాతల సహకారంతో కార్తీకమాస నిత్యాన్నదాన కమిటీని ఏర్పాటుచేశారు. 2019 వరకు వీరి ఆధ్వర్యంలో అన్నదానం కొనసాగింది. అయితే ఇప్పటివరకూ విరాళాల సేకరణకు సంబంధించి జమాఖర్చులు తెలపకుండా నిధులను అన్నదాన కమిటీ సభ్యులు ఇద్దరి వద్దే ఉంచారనే ఆరోపణలు ఉన్నాయి. సుమారు రూ.5 లక్షల నిల్వ ఉందని, దీనిపై వడ్డీ మరో రూ.లక్ష మొత్తంగా రూ.6 లక్షల నిధులు ఉంటాయని తెలిసింది. గత నిల్వకు సంబంధించి జమాఖర్చులు తెలపకుండా మరలా వాళ్లే అన్నదానం నిర్వహించడంపై టీడీపీ నేతలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ప్రైవేట్ ఖాతాల్లోకి..

ఈ ఏడాది కార్తీకమాస అన్నదాన కమిటీ పేరిట రేపాక వారి సత్రంలో అన్నదానం చేస్తున్నారు. అయితే విరాళాలు మాత్రం ఆలయానికి సంబంధం లేదని అంటున్నారు. దాతల ఇచ్చే విరాళాలకు ప్రైవేట్ రశీదులు ఇస్తున్నారు. అలాగే డిజిటల్ పేమెంట్లను కూడా స్వీకరిస్తూ వాటిని ఓ ప్రైవేట్ వ్యక్తి ఖాతాలోకి వెళ్లేలా ఏర్పాట్లుచేశారు. గత రెండేళ్ల ఆలయ అధికారుల ఆధ్వర్యంలో విరాళాల సేకరణ జరగ్గా.. ఇప్పుడు బయట వ్యక్తులకు ఎలా ఇస్తారంటూ టీడీపీకి చెందిన కొందరు నేతలతో పాటు పట్టణ ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అయితే దీనిపై ఆలయ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. అలాగే 2019లో నిల్వ ఉన్న సుమారు రూ.6 లక్షలను కూడా ఇప్పటివరకూ దేవస్థానానికి జమ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

రుచిలేని భోజనాలంటూ..

గత వైఎస్సార్‌సీపీ హయాంలో నిత్యాన్నదానం రుచికరంగా ఉండేదని, ఏ సమయంలో వచ్చినా ఆహారం అందించేవారని.. అయితే ఇప్పుడు భోజనాలు రుచికరంగా ఉండటం లేదని భక్తులు అంటున్నారు. దీనిపై కమిటీ సభ్యులను ప్రశ్నించగా నిత్యావసరాల ధరలు పెరిగాయనే సమాధానమిస్తున్నారని వాపోతున్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల దాటితే భోజనాలు అయిపోయాయని చెబుతున్నారని అంటున్నారు. ఆరోపణలపై అన్నదానం నిర్వాహకులను ప్రశ్నించగా.. తాము చేస్తున్న సేవను చూడలేక ఆరోపణలు చేస్తున్నారని, లెక్క పక్కాగా ఉందని అన్నారు. దాతల విరాళాల వివరాలు తెలిసేలా ఏ రోజుకారోజు సత్రం వద్దే ఏర్పాటు చేస్తున్నామని సమాధానమిచ్చారు. 2019 నాటికి విరాళాలకు సంబంధించి రూ.6 లక్షల వరకు నిల్వ ఉంటుందని అన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో పక్కాగా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2020, 2021లో కోవిడ్ కారణంగా అన్నదానం జరపలేదు. 2022లో ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. 2022లో విరాళాల రూపంలో రూ.13,31,735 లు ఆదాయం రాగా రూ.9,35,561లు ఖర్చయ్యింది. 2023లో రూ.12,84,973లు ఆదాయం రాగా రూ.13,48,070 ఖర్చయినట్టు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే నేరుగా క్షీరారామలింగేశ్వరస్వామి క్షేత్రమే నిత్యాన్నదానం నిర్వహణకు రూ.50 లక్షల నిధులు అవసరం కాగా సుమారు రూ.32 లక్షలు సేకరించి డిపాజిట్ చేశారు. విరాళాలను దేవస్థానం సిబ్బందే వసూలు చేసి కంప్యూటర్ రశీదులు కూడా ఇచ్చారు.

క్షీరారామంలో జ్వాలా తోరణం



జ్వాలాతోరణం వెలిగిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం)లో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని కృత్తికా నక్షత్రం రోజు కావడంతో శనివారం జ్వాలా తోరణం వెలిగించారు. రాత్రి 8 గంటల సమయంలో కార్తికేయునికి పూజలు చేసి గర్భాలయంలో జ్వాలా దీపం వెలిగించి ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ముఖద్వారం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ జ్వాలా దీపంతో జ్వాలా తోరణం వెలిగించారు. ప్రధానార్చకులు కిష్టప్ప, అనిల్, వీరబాబు, ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు ఉన్నారు.

14న లోక్ అదాలత్

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం కోర్టు భవనాల సముదాయం ఆవరణలో డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా తెలిపారు. శనివారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులను రాజీ చేయాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ఎస్ కిరణ్‌శ్రీ, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ.అన్నామణి, గూడెం పట్టణ, రూరల్, నల్లజర్ల, చేబ్రోలు, పెంటపాడు, గణపవరం, నిడమర్రు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

చదరంగ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



చెస్ పోటీల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆర్డీవో దాసి రాజు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక బ్రోచర్‌ను నరసాపురం ఆర్డీవో దాసి రాజు విడుదల చేశారు. శనివారం నరసాపురంలో ఆయన చాంబర్‌లో బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ శారీరక దృఢత్వాన్ని కలిగించే క్రీడలు కొన్నైతే పిల్లల మేధస్సుకు పదును పెట్టే క్రీడల్లో చదరంగం ఒకటన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఈ నెల 24న పాలకొల్లు బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఉన్న యూరోకిడ్స్ స్కూల్‌లో జిల్లా ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో గెలిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు చెస్ బోర్డులు తెచ్చుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9063224466 నెంబరులో సంప్రదించాలన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన తోలేరు విద్యార్థులు

వీరవాసరం: 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ పోటీల్లో తోలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీఎంజెడ్ శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు విశాఖపట్నంలో జరిగిన అండర్-14 బాలికల విభాగంలో ద్వితీయ స్థానం, నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన అండర్ 17 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. విజేతలైన క్రీడాకారులను, పీడీ శ్రీనివాసును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీఎంజెడ్ శ్యాం ప్రసాద్, ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, తదితరులు అభినందించారు.

మద్యం పోయించలేదని దాడి

భీమవరం: మద్యం పోయించలేదని ఒక వ్యక్తి తనపై దాడిచేశాడంటూ భీమవరం పట్టణం గునుపూడికి చెందిన పుచ్చకాయల ప్రసన్నకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై చెప్పారు. ఈ నెల 14న రాత్రి పెరు గుప్యాకెట్ కోసం మిల్క్ సెంటర్‌కు వెళుతుండగా పట్టణానికి చెందిన శాంతారావు తనకు మద్యం ఎందుకు పోయించలేదంటూ ప్రసన్నకుమార్ తలపై సుత్తితో కొట్టి గాయపరిచాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

స్వాములకు భిక్ష భాగ్యంగా..

- ఊరూరా స్వాములకు ఉచిత అన్నప్రసాదం
- ముందుకు వస్తున్న దాతలు
- అయ్యప్ప ఆలయాల్లో ప్రతి రోజూ భిక్ష ఏర్పాట్లు
- జిల్లా వ్యాప్తంగా 20 వేల మంది వరకు మాలధారులు





భీమవరంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పసేవా సమితి వద్ద అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న స్వాములు

సాక్షి, భీమవరం: అన్నదాన ప్రభువుగా అయ్యప్పను భక్తులు కొలుస్తారు. మాలధారులకు భిక్ష ఏర్పాటుచేయడం తమ భాగ్యంగా భావిస్తారు. ప్రస్తుతం మండల దీక్షలు సందర్భంగా ఊరూరా మాలధారులకు ఉచిత అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేస్తూ శబరిగిరీశుడి సేవలో తరిస్తున్నారు. ఆలయాల్లో ప్రతీ రోజు వందలాది మందికి అన్నదానం నిర్వహిస్తున్నారు.

జిల్లా అంతటా కరిమలవాసుడి శరణుఘోష మిన్నంటుతోంది. ఎక్కడ చూసిన నల్లని దుస్తులు, మెడలో మణి మాల, నుదుటన చందనంతో మండల దీక్షాధారులే కనిపిస్తున్నారు. మాలధారణం-నియమాల తోరణం అన్నట్టుగా స్వాముల ఆహార విషయంలోను నియమాలు అత్యంత కఠినంగా ఉంటాయి. దీక్షా సమయంలో ఏకభుక్తం (ఒక్కపూటే భోజనం) చేయాలి. బయట షాపులు, హోటళ్లలో లభించే ఏ ఆహార పదార్థాన్ని ముట్టరు. కనీసం బయట మంచినీళ్లు కూడా తాగరు. తప్పనిసరిగా మడితో వండిన ఆహార పదార్థాలనే భుజిస్తారు. కొందరి ఇళ్ల వద్ద ప్రతీరోజు ఉదయం, సాయంత్రం స్నానం ఆచరించి వంట చేసే వీలుండదు. ఈ నేపథ్యంలో మాలధారులు బృందాలుగా ఏర్పడి ఒకచోట పీఠం ఏర్పాటు చేసుకుని అక్కడే వంట చేసుకుంటుంటారు. మరోపక్క మాలధారుల కోసం ఊరూరా ఆలయ కమిటీలు, భక్త బృందాలు, దాతలు ఉచిత అన్నప్రసాదాలు ఏర్పాటుచేస్తున్నారు. ఇంట్లో మడిగా భిక్షకు అవకాశం లేని అనేక మంది మాలధారులకు, విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం నిమిత్తం బయటి ప్రాంతాలకు వెళ్లే స్వాములకు ఇవి ఎంతో ప్రయోజనకరంగా ఉంటున్నాయి. చాలాచోట్ల మండల దీక్షలు మొదలు నుంచి పూర్తయ్యే వరకు, అక్కడక్కడ మకర జ్యోతి దర్శనం వరకు భిక్ష అందిస్తున్నారు. భిక్షకు ఇబ్బంది లేకపోవడంతో అయ్యప్ప మాలలు ధరించే వారి సంఖ్య ఏటా పెరుగుతోందని గురుస్వాములు అంటున్నారు.

పదేళ్ల కల నెరవేరింది



స్వాములకు ఉచిత అన్నప్రసాదాన్ని అందించాలన్న పదేళ్ల కల గత ఏడాది నెరవేరింది. 30 మంది స్వాములు కమిటీగా ఏర్పడి 2023 నుంచి ఉచిత భిక్షను ఏర్పాటు చేస్తున్నాం. రోజూ రెండు వేల మంది వరకు స్వాములు భిక్షను స్వీకరిస్తున్నారు.

– కె.ఉదయ బాలాజీ, గురుస్వామి, భీమవరం

మాలధారులందరికీ అన్న ప్రసాదం



నరసాపురంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప, దుర్గామాత, ఆంజనేయస్వామి, శివ మాలధారులందరికి గత పదేళ్లుగా అన్నప్రసాదం అందిస్తున్నాం. దాతల సహకారంతో ఏటా ఈ కార్యక్రమాన్ని నిరాటంకంగా నిర్వహిస్తున్నాం.

– కోటిపల్లి బ్రహ్మానందం, గురుస్వామి, నరసాపురం

వేలాది మందికి స్వాములకు అన్నప్రసాదాలు

- జిల్లా కేంద్రం భీమవరంలో గత ఏడాది పట్టణానికి చెందిన గురుస్వామి కొండా ఉదయ బాలాజీ, మరికొందరు కమిటీగా ఏర్పడి డీమార్ట్ వద్ద శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి సేవా సమితిని స్థాపించి ఉచిత అన్నప్రసాదాన్ని ప్రారంభించారు. అడ్డ వంతెన వద్ద అయ్యప్ప దీక్షా మందిరం, అలాగే చనమల సత్యనారాయణ ట్రస్టు చనమల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గొల్లవానితిప్ప రోడ్డులో, బీవీ రాజు మున్సిపల్ పార్కు, భోగలింగేశ్వరస్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో రోజూ దాదాపు నాలుగు వేల మంది స్వాములకు భిక్ష అందిస్తున్నారు.
- తాడేపల్లిగూడెం మండలం పడాలలోని అయ్యప్ప ఆలయంలో 1997 నుంచి అయ్యప్ప దీక్షాధారులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. ఏటా అక్టోబరు 15 నుంచి నవంబరు 15 వరకు కొవ్వూరి గాంధీరెడ్డి, హేమాద్రి నర్సారెడ్డి జ్ఞాపకార్థం కొవ్వూరి అమ్మాజీ, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సహకారంతో రోజూ వెయ్యి మంది వరకు స్వాములకు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు.
- ఆకివీడు మండలం కుప్పనపూడిలో గురుస్వామి నూకల రామదాసు ఆధ్వర్యంలో రోజూ 250 మందికి పైగా అయ్యప్ప, భవాని, శివ, గోవింద మాలాధారులకు ఉచిత భోజనాలు, ఉదయం అల్పాహారం పెడుతున్నారు.
- కాళ్ల మండలం దొడ్డనపూడిలో ఉన్న శ్రీరాజరాజేశ్వరి ఆలయం వద్ద గ్రామానికి చెందిన మాలధారులు సుమారు 50 మందికి అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు.
- వీరవాసరం మండలం చింతలకోటిగరువులో రోజూ 200 మంది వరకూ స్వాములకు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు.
- నర్సాపురంలోని అయ్యప్ప ఆలయం వద్ద కోటిపల్లి బ్రహ్మానందం గురుస్వామి ఆధ్వర్యంలో రోజూ సుమారు వెయ్యి మంది మాలధారులకు అన్నదానం చేస్తున్నారు.
- పాలకొల్లులోని నర్సాపురం రోడ్డులో గల అయ్యప్పస్వామి ఆలయం వద్ద గత 11 ఏళ్లుగా రోజూ 800 మంది వరకు స్వాములకు అన్నప్రసాద పంపిణీ జరుగుతోంది.
- యలమంచిలి మండలం మేడపాడులో గుర్రాల వెంకట్రావు ఆధ్వర్యంలో గత 37 ఏళ్లుగా 42 రోజులపాటు 50 మందికి భిక్ష ఏర్పాటు చేస్తున్నారు.
- పెనుగొండలోని అయ్యప్పస్వామి పెద్దపీఠం వద్ద రోజు సుమారు 120 మందికి భిక్ష ఏర్పాటు చేస్తున్నారు.
- మార్టేరులోని అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అడబాల శ్రీనివాస్, మల్లిడి రామకష్టారెడ్డి, చిన్నారెడ్డి ఆధ్వర్యంలో రోజు సుమారు వంద మందికి భిక్ష అందిస్తున్నారు.
- తణుకులోని శ్రీధర్మశాస్త్ర పంచాయతన అయ్యప్ప స్వామి ఆలయంలో గురుస్వాములు వేమూరి చలపతి, చల్ల భరణి ఆధ్వర్యంలో రోజూ 300 మంది మాలధారులకు ఉచితంగా భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. తణుకు ఎన్ఎస్ బోస్ రోడ్డులో చెక్క రామకష్ణ దంపతులు ఐదేళ్లుగా కార్తీక మాసంలో మాలధారులకు ఉచిత భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక వాసవీ ప్లాజాలో 300కు పైగా మాలధారులు భిక్ష స్వీకరిస్తున్నారు.

ఉత్సాహంగా జోనల్ పోటీలు





పోలసానిపల్లి గురుకుల పోటీల్లో కబడ్డీ ఆడుతున్న బాలికలు, వాలీబాల్ ఆడుతున్న ఇరు జట్లు

భీమడోలు: పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో శనివారం జోన్-2 బాలికల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. జోన్ పరిధిలోని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన 1050 మంది బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. కళాశాల స్థాయి 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పి.తేజస్విని(జంగారెడ్డిగూడెం), జి.భూమిక(పోలసానిపల్లి), జి.ప్రవల్లిక(గోపాలపురం), పాఠశాల స్థాయిలో 100 మీటర్ల పరుగులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో జి.విమలశ్రీ(రాజమండ్రి), టి.పూజ(కుంటముక్కల), టి.నీలిమ ప్రియ(ద్వారకాతిరుమల) విజేతలుగా నిలిచారు. 100 మీటర్ల పరుగు కళాశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కె.మంజూన(గోపాలపురం), యు.భవానీ(తుని), డి.ప్రియ(రాజమండ్రి), 200 మీటర్ల పరుగు పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో సీహెచ్ కుమారి(ద్వారకాతిరుమల), డి.ప్రవల్లిక(జంగారెడ్డిగూడెం), కె.మనీషా(పోలసానిపల్లి), కళాశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కె.కుసుమలత(గోపాలపురం), వి.నిఖిత(ముప్పాళ్ల), కె.మంజూష(గోపాలపురం) విజేతలుగా నిలిచారు. త్రోబాల్ పోటీల పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పి.కృష్ణశ్రీ(కొవ్వూరు), కె.శ్రీవల్లి(ద్వారకాతిరుమల), ఎన్.రాణని(జంగారెడ్డిగూడెం), కళాశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కె.లావణ్య(తుని), కె.నిధి(కుంటముక్కల), వి.నిఖిత(ముప్పాళ్ల) విజేతలుగా నిలిచారు. జావెలెన్‌త్రో కళాశాల విభాగంలో జి.శ్రావణి(ద్వారకాతిరుమల), ఎస్.దీప్తి(జగ్గయ్యపేట), ఓ.హారిక(పోలసానిపల్లి) విజేతలుగా నిలిచారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, క్యారమ్స్ జట్లు సెమీఫైనల్, ఫైనల్ పోటీలకు చేరుకున్నారు. ఆదివారం విజేతలను ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

తక్కువ రేటుకే బంగారమంటూ మోసం

ముగ్గురి అరెస్ట్, రూ.16 లక్షల రికవరీ



స్వాధీనం చేసుకున్న నగదు, నకిలీ బంగారంతో ఎస్పీ కేపీ శివకిషోర్ తదితరులు

ఏలూరు టౌన్ : మా దగ్గర భారీగా బంగారు ఆభరణాలు ఉన్నాయని.. తక్కువ రేటుకే మంచి బంగారు నగలు ఇస్తామని ఆశచూపి మోసగిస్తారు. తీరా అక్కడి వెళ్లాక మన వద్ద డబ్బుతో ఉడాయిస్తారు. ఇలాంటి ముఠాను ఏలూరు జిల్లా కైకలూరు రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వివరాలు వెల్లడించారు.

కృష్ణాజిల్లా పెడన మండలం చెన్నూరు గ్రామానికి చెందిన పంద్రాజు రవీంద్రకుమార్ ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం శ్రీహరిపురం గ్రామంలో చేపలు, రొయ్యల సాగు చేస్తున్నాడు. గతంలో చేపల చెరువుపై పనిచేసిన వ్యక్తి రవీంద్రకుమార్‌కు ఫోన్ చేసి తన దగ్గర భారీగా బంగారం ఉందని, తక్కువ రేటుకే ఇచ్చేస్తామని మాయమాటలు చెప్పాడు. కొన్ని రోజుల అనంతరం రవీంద్రకు నమ్మకం ఏర్పడడంతో అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు ఇచ్చేందుకు అక్టోబర్ 23న సింగరాయపాలెం సెంటర్‌కు వెళ్లాడు. అక్కడ ఈ ముఠాలోని వ్యక్తి తన నడుముకు చుట్టి ఉన్న గొలుసు చివరన బంగారపు పూసలు చూపించాడు. ఈ గొలుసులో చివరి మూడు పూసలు తీసుకుని చెక్‌చేయించుకున్నాడు. అవి బంగారంతో చేసినవే అని చెప్పడంతో అడ్వాన్స్ చెల్లించాడు. ముఠా సభ్యులు పక్కా పథకంతో అక్టోబర్ 24న రవీంద్రను విజయవాడ రావాలని, అక్కడ బంగారం ఇస్తామని నమ్మించారు. విజయవాడ వెళ్లగా, గుంటూరు రమ్మని చెప్పారు. బాధితుడు రవీంద్ర వెళ్లగా.. ఒక్కసారిగా దాడి చేశారు. చంపుతామంటూ బెదిరించి అతని నుంచి రూ.15 లక్షలు నగదును లాక్కుని వెళ్లిపోయారు.

తాను మోసపోయానని గ్రహించిన రవీంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ కేపీ శివకిషోర్ ఆదేశాలతో కైకలూరు సీఐ రవికుమార్, ముదినేపల్లి, కలిదిండి, మండవల్లి ఎస్‌ఐలు తమ సిబ్బందితో బృందాలుగా దర్యాప్తు ప్రారంభించారు. మదనపల్లిలోని పక్షిరాజు గూడెం, మైసూర్ ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పక్షిరాజుగూడెంలో పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం మల్లాలుపేట ప్రాంతానికి చెందిన దబ్బా ఈశ్వర్, బాణవతు చిన్న, చిత్తూరు జిల్లా వేంపాడు ఈశ్వర్ కాలనీకి చెందిన భూక్యా సాంబ్ర అలియాస్ శ్యామ్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.16 లక్షల నగదు, నకిలీ బంగారపు పూసల దండలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సీఐ వి.రవికుమార్, ఎస్సైలు వీఎస్‌వీ భద్రరావు, సూర్య రామచంద్రరావు, వీ.వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారంతో అభినందించారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు కొవ్వలి విద్యార్థి



విద్యార్థి వెస్లీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఏలూరు జిల్లా దెందులూరు మండలం కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థి ఈ.చార్లెస్ వెస్లీ ఎంపికయ్యారని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శర్మ, ఫిజికల్ డైరెక్టర్ సురేష్ అన్నారు. శనివారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శర్మ, అసిస్టెంట్ ఏ.సుధారాణి మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 23 వరకు చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాజ్‌నందగావ్‌లో జరిగే 68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్‌బాల్ అండర్ -14 పోటీలకు కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థి వెస్లీ ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



తణుకులో రైలు ఢీకొని మృతి చెందిన సత్యవతి

తణుకు: రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన శనివారం తణుకు రైల్వే అవుట్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన సంగాని సత్యవతి (74) ఇంటింటికీ తిరిగి రొయ్యిలు విక్రయించేది. ఈ క్రమంలో శుక్రవారం పైడిపర్రు నుంచి సజ్జాపురం వెళ్లేందుకు గౌతమి సాల్వెంట్స్ వద్ద రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యవతి అక్కడికక్కడే మృతి చెందింది. భీమవరం రైల్వే ఎస్సై పీటీవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో చిన్నారి మృతదేహం లభ్యం

పెనుమంట్ర : వెలగలవారిపాలెం గ్రామంలో తల్లీ కూతురు అదృశ్యం కేసులో బ్రాహ్మణ చెరువు గోస్తని పంట కాలవలో కుమార్తె మృతదేహం లభించిందని పెనుమంట్ర ఎస్సై కే స్వామి తెలిపారు. తన కుమార్తె సప్ప దుర్గా మల్లేశ్వరి(32), మనవరాలు ఉమా దుర్గ శ్రీ (11) కనిపించడం లేదని వెలగలవారి పాలెంకు చెందిన గోగాడ ముత్యాలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాలువలో గుర్తుతెలియని మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పరిశీలించగా.. ఉమ దుర్గాశ్రీగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. దుర్గా మల్లేశ్వరి ఆచూకీ కోసం గాలిస్తున్నామన్నారు. మల్లేశ్వరికి 14 ఏళ్ల క్రితం పెనుమంట్రకు చెందిన శ్రీకాంత్‌తో వివాహమైంది. ఇద్దరు పిల్లలు పుట్టిన అనంతరం శ్రీకాంత్ దుబాయ్ వెళ్లడంతో అప్పటినుంచి అప్పటినుంచి మల్లేశ్వరి వెలగలవారి పాలెం గ్రామంలోని పుట్టింట్లో ఉంటోంది. ఇటీవల దుబాయ్ నుంచి వచ్చిన శ్రీకాంత్ భార్య బిడ్డలతో అన్యోన్యంగా గడిపి నెలరోజుల క్రితమే తిరిగి దుబాయ్ వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి జీవితంలో స్నాతకోత్సవం మరపురానిది



విద్యార్థికి పట్టా అందిస్తున్న ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ రిజిస్ట్రార్ సుధాకర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతీ విద్యార్థి జీవితంలో స్నాతకోత్సవం గొప్ప కార్యక్రమమని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జీ సుధాకర్ అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి అటానమస్ కళాశాల ఆడిటోరియంలో శనివారం 2019 -22 విద్యాసంవత్సరం యూజీ, 2020-22 విద్యాసంవత్సరం పీజీ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకర్ మాట్లాడుతూ సీఆర్ రెడ్డి విద్యాసంస్థల గత పాలకవర్గ అధ్యక్షుడు అల్లూరి బాపినీడు నుంచి ప్రస్తుత పాలకవర్గ అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్ ఆధ్వర్యంలో దినదినాభివృద్ధి చెందడం చూసి ఆనందిస్తున్నామని, రాబోయే కాలంలో ఈ విద్యాసంస్థ విశ్వవిద్యాలయంగా ఎదగబోతుందన్నారు. విద్యాసంస్థల అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత క్రమశిక్షణ ఉంటేనే విద్యార్థి తన కలలను సాకారం చేసుకోగలరని, దీనికి క్యారెక్టర్, కమిట్మెంట్, కమ్యూనికేషన్ దోహదం చేస్తాయన్నారు. విద్యాసంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల సమగ్ర వికాసానికి అనేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డేలో ప్రతిభ కనబరచిన 36 మందిలో యూజీ 18, పీజీ 18 మంది విద్యార్థులు గోల్డ్, సిల్వర్ మెడల్స్ పొందారని, యూజీలో 657 మంది విద్యార్థులు, పీజీలో 230 మంది విద్యార్థులు పట్టాలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు వీవీ బాలకృష్ణారావు, ఏవీ సుబ్రహ్మణ్యం, చిట్టూరి జానకి రామయ్య, కొడాలి వెంకట సుబ్బారావు, వల్లభనేని శ్రీకృష్ణ, కేఎస్ విష్ణు మోహన్, కానాల శ్రీనివాసరావు, కలగర శివరామకృష్ణ ప్రసాద్, పీ శ్రీరంగం, వంకినేని రఘు, కే విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు



అనివేటి మండపంలో కోలాట నృత్యాలు

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు కార్తీకమాస పర్వదినాలను పురస్కరించుకుని వేలాదిగా భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్ద ఎత్తున భక్తులు ఆలయ ఆవరణలోని చెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

జాతీయ స్థాయి సమావేశానికి నిట్ బృందం



అవార్డు అందుకున్న ఏపీ నిట్ బృందం

తాడేపల్లిగూడెం: భువనేశ్వర్‌లో డీఎస్ఐఆర్-సీఆర్డీహెచ్ కాన్‌క్లేవ్ జాతీయ స్థాయి సమావేశానికి తాడేపల్లిగూడెం నిట్ బృందం హాజరైంది. బృందానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సహాయ ఆచార్యులు డాక్టర్ పెదపాటి శంకర సారథ్యం వహించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ నిర్వహించిన కార్యక్రమంలో కామన్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ హబ్‌లు సాధించిన పురోగతిని చర్చించారు. ఈ సందర్భంగా చేసిన ప్రజెంటేషన్ అవార్డు అందుకుంది.

వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: వివాహేతర సంబంధం తెలిసిపోవడంతో భయపడి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్‌టౌన్‌లో మహారాష్ట్రకు చెందిన సునీల్ అత్మరామ్ నలవాడి (30) బంగారం వ్యాపారం చేసేవాడు. ఆత్మరామ్ భార్యనుంచి విడిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. అతని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న యువకుడి భార్యతో ఆత్మరామ్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంలో డ్రైవర్‌కు తెలియడంతో భయంతో శనివారం ఆత్మరామ్ ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

రేషన్ బియ్యం సీజ్

భీమడోలు: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేశారు. ఏలూరు నుంచి ఉండ్రాజవరం గ్రామానికి 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా భీమడోలు రైల్వే గేటు వద్ద విజిలెన్స్, రెవెన్యూ, పౌరసరఫరాల విభాగం అధికారులు పట్టుకున్నారు. బాధ్యులైన ఏలూరుకు చెందిన జన్యావుల సుధాకర్, వ్యాన్ డ్రైవర్ బీటీఎస్ మణికంత, ఉండ్రాజవరానికి చెందిన బాషాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో జన్యావుల సుధాకర్, డ్రైవర్ మణికంతలను అరెస్ట్ చేసి భీమడోలు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

క్లుప్తంగా

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఈడూరులో వరాల వేంకటేశ్వరస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అత్తిలి: ఈడూరులో వేంచేసియున్న వరాల వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, ఉదయం అర్చనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు దాతల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

జిల్లాస్థాయి బాక్సింగ్ జట్టు ఎంపిక

అత్తిలి: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాశాఖాధికారి ఎన్ రమేష్ అన్నారు. శనివారం అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాక్సింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. సెలెక్షన్ కమిటీ సభ్యులు ఎండీ కుదుస్, శేఖర్‌బాబు, శ్రీనివాస్ సమక్షంలో బాక్సింగ్ జిల్లా టీంను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రసాద్, హెచ్ఎం వై లక్ష్మీనారాయణ, జిల్లా బాక్సింగ్ అసోయేషన్ అధ్యక్షుడు విజయదుర్గ ప్రసాద్‌రెడ్డి, బాక్సింగ్ అసోయేషన్ సెక్రటరీ కె చిరంజీవి, పీడీ జాన్సన్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో 17 పతకాలు సాధించిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో శశి వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ

తాడేపల్లిగూడెం: జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ స్థాయి సెంట్రల్ జోన్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక శశి ఇంజనీరింగ్ విద్యార్థులు 17 పతకాలు సాధించారని శశి కళాశాల పాలకవర్గ వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ శనివారం తెలిపారు. మహిళల విభాగంలో 200 మీటర్ల విభాగంలో బి.హేమ తేజస్విని రజత పతకం, 1,500 మీటర్ల విభాగంలో పీపీ.స్వాతి స్వరూప రజతం, షాట్‌పుట్‌లో యు.యశశ్రీ రజతం, డిస్కస్‌త్రోలో కాంస్య పతకం, రిలే పరుగు పందెంలో పి.స్వాతి స్వరూప, ఏ.నాగనందిని, బి.హేమ తేజస్విని, టి.హిమదుర్గ రజత పతకాలు కైవసం చేసుకున్నారని తెలిపారు. పురుషుల విభాగంలో హైజంప్‌లో పి.చక్రమణికంఠ రజతం, 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించాడని తెలిపారు. పదివేల మీటర్ల పరుగులో కేఎన్‌వీ.దుర్గారావు జావెలిన్ త్రోలో ఏం.శరణ్, రిలే పరుగుపందెంలో పి.భరత్, పి.చక్రమణికంఠ, బి.ప్రిన్స్‌బాబు, జీబీవీ. ఆదిత్య కాంస్య పతకాలు సాధించారన్నారు. విజేతలను సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తదితరులు అభినందించారు.

సూర్యరశ్మితో చవకగా విద్యుత్ ఉత్పత్తి

తాడేపల్లిగూడెం రూరల్: సోలార్ ప్యానల్స్ ద్వారా సూర్యరశ్మిని, గాలిని వినియోగించుకుని సహజ సిద్ధంగా చవకగా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రఘునాథబాబు అన్నారు. శనివారం మండలంలోని చినతాడేపల్లిలో సూర్యఘర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ రఘునాథ బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 8,500 సోలార్ ప్యానల్స్‌ను అందించేందుకు పేర్లు రిజిస్టర్ చేశామన్నారు.త్వరలోనే ప్రభుత్వ, వ్యవసాయ అవసరాలకు సోలార్ ప్యానల్స్‌ను అమర్చుతామన్నారు. ప్రభుత్వం 200 యూనిట్లు సబ్సిడీ ఇస్తుందని, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చన్నారు. మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, డీఈఈ కే.నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ ముత్యాల వీరవెంకటసత్యనారాయణ మాట్లాడారు. ఎంపీటీసీ దూలపల్లి సత్తియ్య, పిచ్చికల నాగశ్రీనివాస్, కార్యదర్శి బిరుదుకోట రమేష్, విద్యుత్ ఏఈలు పాల్గొన్నారు.

వ్యక్తిని కొట్టిన నేరారోపణపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: ఒక వ్యక్తిని నిర్బంధించి కొట్టిన నేరారోపణపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై జేఎన్‌వీ.ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగన్నాథపురానికి చెందిన లక్కోజు శ్రీనివాస్ భార్య మృతి చెందడంతో ఆమె పిల్లల పేరున ఆస్తిని రాయాలని కొందరు ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో తాడేపల్లిగూడెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కోపెల్ల జయరాజు, మరో అరుగురు ఇచ్చిన పత్రాలు సరిగా లేకపోవడంతో శ్రీనివాస్ సంతకాలు పెట్టేందుకు నిరాకరించాడు. దీంతో అతడిని కారులో నిర్బంధించి జగన్నాథపురం తీసుకొచ్చి కొట్టినట్లుగా బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం

- తణుకులో అధ్వానంగా డ్రెయినేజీలు
- దోమల ఉధృతితో అల్లాడుతున్న పట్టణ వాసులు
- జ్వరాలు వ్యాపిస్తున్నా పట్టించుకోని శానిటరీ అధికారులు



తణుకు బ్యాంక్ కాలనీలో చెత్తాచెదారాలతో పేరుకుపోయిన డ్రెయినేజీ



తణుకు విఘ్నేశ్వరస్వామి ఆలయం ఎదురుగా పూడుకుపోయిన డ్రెయినేజీ

తణుకు అర్బన్: ఒక పక్క వైరల్ జ్వరాలు మరోపక్క దోమల బెడదతో తణుకు వాసులు బెంబేలెత్తిపోతున్నారు. దోమ కనిపిస్తే చాలు విష సర్పం కంటే ప్రమాదకరంగా చూసే పరిస్థితి నెలకొంది. ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదని ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీ పరిధిలోని డ్రెయినేజీల్లో చెత్త, వ్యర్థాలకు తోడు దోమ లార్వా విపరీతంగా దర్శనమిస్తుండడంతో ప్రజలు భయపడుతున్నారు. ప్రధాన రహదారుల్లో ఉన్న పెద్ద డ్రెయినేజీల్లో నీటి ప్రవాహం సరిగా లేక ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉంటోంది. దోమలే కాకుండా వాటి లార్వా సైతం డ్రెయినేజీల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

ఊదరగొడుతున్న వైద్యశాఖ

ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులను నివారించుకోవచ్చని వైద్యారోగ్య అధికారులు, సిబ్బంది ఊదరగొట్టేస్తున్నారు. ఫ్రైడే డ్రైడే అని, కీటక జనిత వ్యాధులను నివారించాలంటే దోమల నివారణ తప్పదంటూ ఇంటింటికీ వెళ్లి రుబ్బురోళ్లు, తిరగళ్లు, టైర్లు వంటి సామగ్రిని తిరగబెట్టేస్తున్నారు. దీంతో ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకుంటున్నారు. ప్రధాన డ్రెయినేజీల నిండా దోమ లార్వా విపరీతంగా కనిపిస్తుంటే వాటి నిర్మూలన దిశగా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. డ్రెయినేజీలను విస్మరించి ఇంటి ఆవరణ శుభ్రం చేసుకోమంటూ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వీధుల్లో తిరుగుతున్నారని ప్రజానీకం విమర్శిస్తున్నారు.

ప్రత్యేక యాప్‌ను వినియోగించని వైద్య శాఖ సిబ్బంది

డ్రెయినేజీల్లో ఉన్న సమస్యలను ప్రత్యేక యాప్‌లో వైద్యశాఖ సిబ్బంది అప్‌లోడ్ చేయాల్సి ఉన్నా ఆ దిశగా పనిచేయడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫైలేరియా, డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపింపజేసే దోమలు ఇళ్ల ముందు, వీధుల్లో ఉండే డ్రెయినేజీల్లో దర్శనమిస్తుంటే అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు నిలదీస్తున్నారు. తణుకు పట్టణంలో డ్రెయినేజీల్లో నిలిచిపోయిన మురుగునీరు, పేరుకుపోయిన షిల్ట్‌లో ఉధృతంగా వృద్ధి చెందుతున్న దోమ లార్వాను, దోమలను చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

మస్టర్లపైనే శ్రద్ధ

తణుకు మునిసిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణకు ఇద్దరు శానిటరీ అధికారులు విధుల్లో ఉండగా 9 మంది మేస్త్రిలు, 10 మంది వార్డు సెక్రటరీలు, తాత్కాలిక, పూర్తిస్థాయి పారిశుద్ధ్య కార్మికులు 200 మంది వరకు విధుల్లో ఉంటున్నారు. నిత్యం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, పారిశుద్ధ్యం విషయంలో ఎటువంటి సమస్య రాకుండా చూసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కార్మికుల మస్టర్లను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు చూపించే శ్రద్ధ పారిశుద్ధ్య నిర్వహణపై లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి

కదలికలేని నీటి నిల్వల్లో దోమ వదిలిన లార్వా సుమారుగా 8నుంచి 10రోజుల్లోపు దోమగా మారు తుందని వైద్యారోగ్య శాఖ సిబ్బంది కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఇళ్లలో అవసరంలేని నీటి నిల్వలను వారానికోసారి శుభ్రం చేసుకుని నివాసితులు జాగ్రత్తలు పాటిస్తున్నారు. కానీ ప్రతిరోజూ పారిశుద్ధ్య సిబ్బంది తమకు కేటాయించిన డ్రెయినేజీల్లో చెత్త వ్యర్థాలను తొలగించడంలేదు. పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో శానిటరీ అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షించాల్సి ఉంది. పర్యవేక్షణలో శానిటరీ అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి.

పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదు



తణుకు మునిసిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోగా కనీసం ఏదైనా ప్రాంతంలో ఇబ్బందులు ఉన్నాయని ఫిర్యాదు చేసినా పట్టించుకోని దుస్థితి నెలకొంది. డ్రెయినేజీలన్నీ చెత్త, వ్యర్థాలు, దోమల లార్వాతో నిండి ఉన్నాయి. షిల్ట్‌ను తొలగింపునకు చర్యలు కరువయ్యాయి.

– పొట్ల సురేష్, న్యాయవాది, తణుకు

ఉల్లాసంగా చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీల కోసం హాజరైన విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాపయ్య శర్మ



అత్తిలి శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



వేల్పూరులో గ్రంథాలయ ఉద్యమ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయంలో శనివారం పట్టణంలోని వివిధ పాఠశాలలనుంచి హాజరైన విద్యార్థులు చిత్రలేఖన పోటీల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. పోటీపడి వివిధ చిత్రాలను గీశారు. జూనియర్లకు మన దేశ నాయకులు, జాతీయ జెండా, సీనియర్లకు మన బడి-పరిసరాలు అంశాలపై పోటీలు పద్దారు. తొలుతగా విద్యార్థులకు చిత్రలేఖనం-వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రత్తి వీరాస్వామి, గరికపాటి బాపయ్యశర్మ, వి.జాన్‌బాబు, ప్రేమకుమార్, జయప్రద న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

అత్తిలిలో..

అత్తిలి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం అత్తిలి శాఖ గ్రంథాలయంలో అమర్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్స్ విభాగాల్లో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాస్త్ర పితామహులు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డు గ్రంథాలయాధికారి గంధం శేషవేంద్రరావు, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, ఆర్ దానకృష్ణ, బి మహాలక్ష్మి, పావని, ఎం శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు. ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో జాతీయ జర్నలిజం డే ఘనంగా నిర్వహించారు. న్యాయవాది ఎస్ఎస్ రెడ్డి, గ్రంథాలయాధికారి శ్రీనివాసరెడ్డి, అమృతరావు, ఎం కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

తణుకు టౌన్: సమాజానికి మూడు ఆలయాలైన దేవాలయం, వైద్యాలయం, గ్రంథాలయం అవసరమని, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనే మహానీయులు గ్రంథాలయ సేవలను గుర్తించి ఉద్యమాలు చేశారని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వీ వెంకటరాజు చెప్పారు. తణుకులోని జిల్లా పురుషుల శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో జాతీయ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన గ్రంథాలయ ఉద్యమ నాయకుల సంస్మరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆధ్వర్యంలో శనివారం గ్రంథాలయాల ఏర్పాటు కోసం ఉద్యమం చేసిన అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి సుగుణకుమారి, జీ ఉష, పృథ్వీనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా గ్రంథాలయంలో...

తణుకు మహిళా గ్రంథాలయం ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయం ఆధ్వర్యంలో శనివారం గ్రంథాలయాల ఏర్పాటు కోసం ఉద్యమించిన నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు లక్ష్మీదేవి, ఎం వీరమణి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ పాల్గొన్నారు.

వేల్పూరులో...

తణుకు మండల వేల్పూరులో శాఖా గ్రంథాలయంలో శనివారం మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సీహెచ్ సత్యనారాయణ, తోట వెంకట్రావు, గుణ్ణం బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



అత్తిలిలో మాట్లాడుతున్న నాల్గవ అదనపు జిల్లా జడ్జి సత్యవతి

అత్తిలి: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలున్నాయని వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తణుకు చైర్మన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి సత్యవతి అన్నారు. శనివారం అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ, ఆశ, డ్వాక్రా మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తూ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి సత్యవతి మాట్లాడుతూ అన్యాయానికి గురైన మహిళలకు అండగా అనేక చట్టాలున్నాయని వివరించారు. రిసోర్సుపర్సన్లు కౌరు వెంకటేశ్వర్లు, కోలా దుర్గాభవాని పలు అంశాలను వివరించారు. ఉచిత న్యాయ సహాయం, సలహా కోసం జాతీయ న్యాయసేవల సంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి పాతర్లంక సాయిరాం, స్పెషల్ మెజిస్ట్రేట్ పీఎస్‌పీ చిరంజీవిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, సీడీపీఓ ప్రమోదకుమారి, తహసీల్దార్ దశిక వంశీ, ఎంపీడీఓ పి శామ్యూల్, ఎస్సై పి ప్రేమరాజు, తణుకు కోర్టు న్యాయవాదులు ముప్పిడి సుబ్బయ్య, తిర్రే సత్యనారాయణరాజు, టి బాలరాజు, కామన మునిస్వామి, మహిళా న్యాయవాదులు పోణంగి శ్రావణి సమీరా, ఎస్‌కే మోతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సత్యసాయి జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సత్యసాయి జయంతి సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు డీఎస్ చెరువు సమీపంలోని సత్యసాయి మందిరంలో నిర్వహించనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, విజయవంతం చేయాలని మందిర కన్వీనర్ ఎంఎస్ఎస్‌కే జనార్దనరావు కోరారు. శనివారం మందిరం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఓంకార సుప్రభాత, నగర సంకీర్తన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తామన్నారు, పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. రుద్ర సాయి, సంగీత విజయసాయి, మల్లికార్జునరావు, గ్రంధి సాయి, ప్రవా శ్రీనివాస్, త్రినాథరావు పాల్గొన్నారు.

108 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): 108 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్, పైలెట్స్ రాజు, అనూష, చిరంజీవి, శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని ఎంఆర్‌ఓ, ఎండీఓలకు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ శనివారం స్థానిక కార్యాలయంలోని ఎమ్మార్వోకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 25 నుంచి సమ్మె చేపడతామని వారన్నారు.

అండర్ 19 స్కూల్ గేమ్స్‌లో తణుకు విద్యార్థినుల ప్రతిభ



ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థినులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

తణుకు టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19లో విభాగంలో అంతర్ జిల్లా ఆటల పోటీల్లో తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ బీహెచ్ హిమబిందు తెలిపారు. ఏలూరు జిల్లా పెదవేగిలోని ఏపీఆర్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ విభాగంలో విద్యార్థిని శిరీషా జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని జి.విజయలక్ష్మి, శిరీషా పశ్చిమ జిల్లా జట్టు తరపున పాల్గొని ద్వితీయ స్థానం పొందినట్లు తెలిపారు. శ్రీకాకుళంలో నిర్వహించిన బాస్కెట్ బాల్ పోటీల్లో విద్యార్థినులు ఎస్.భారతి, బి.సురేఖ జిల్లా జట్టు తరపున పాల్గొని ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థినులను కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, పీడీ ఎం శ్రీనివాసరావు అభినందించారు.

అర్హులందరికీ ఇంటి స్థలం కేటాయించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ మూడు సెంట్ల భూమి ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుడికి రూ.5 లక్షలు కేటాయించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు కోరారు. పట్టణంలోని కేఎస్ఎన్ కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 18న ఇళ్ల స్థలాలు కోసం సచివాలయాల వద్ద ఆర్జీల సమర్పిస్తామన్నారు. వడ్డది మేరీ, మాసా బాబూరావు పాల్గొన్నారు.

తణుకులో ప్రత్యక్షమైన నాగసాధువు అఘోరీ



తణుకులో రాజేష్‌నాథ్ అఘోరీని కలిసిన నాగసాధువు అఘోరీ

తణుకు అర్బన్: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల హాట్ టాపిక్‌గా మారిన నాగ సాధువు అఘోరీ శనివారం రాత్రి తణుకులో ప్రత్యక్షమయ్యారు. తణుకు బ్యాంక్ కాలనీలోని రాజేష్‌నాథ్ అఘోరీ నివాసానికి ఆమె వచ్చారు. ఈ సందర్భంగా అఘోరీ మాట్లాడుతూ హిందూధర్మ పరిరక్షణతో పాటు గోవధ నిర్మూలన, మహిళలపై అత్యాచారాలు దాడులకు నిరసన వ్యక్తం చేస్తున్నానని లోక కల్యాణార్థమే పర్యటిస్తున్నట్టు చెప్పారు. తన గురువు రాజేష్ నాథ్ అఘోరీని కలిసేందుకు తణుకు వచ్చినట్లు స్పష్టం చేశారు. ఇక్కడ నుంచి తెలంగాణలోని ముత్యాలమ్మతల్లి ఆలయానికి వెళ్తున్నానని ఇటీవల ఆలయంపై జరిగిన దాడికి అక్కడే తన నిరసన తెలపనున్నానని వివరించారు.

అయ్యప్పస్వామికి అన్నాభిషేకం

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారి సమీపంలోని శ్రీధర్మశాస్త్ర పంచాయతన అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. గురుస్వామి వేమూరి చలపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నాభిషేకంలో సత్యనారాయణ, మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణానికి చెందిన జొన్నలగడ్డ మణికంఠ సౌజన్యంతో 10 క్వింటాళ్ల అన్నంతో అభిషేకం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

80 మందికి వైద్య పరీక్షలు

తణుకు టౌన్: తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయాబెటిక్ శిబిరంలో 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు జిల్లా లయన్స్ డయాబెటిక్ చైర్మన్ వావిలాల సరళాదేవి చెప్పారు. శనివారం తణుకులోని 24వ వార్డులో స్వర్ణ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.శేషుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఉచితంగా సుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, సుగర్ కిట్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 73 లయన్స్ క్లబ్‌ల ద్వారా ఒక్కో క్లబ్ ద్వారా కనీసం 100 మందికి సుగర్ వ్యాధి నిర్ధారణ, మందులను పంపిణీ చేసేలా కృషి చేస్తున్నట్లు సరళాదేవి తెలిపారు. డాక్టర్ కుదారి ఆనంద్, వావిలాల వెంకట రమేష్, మారుతీ, బుజ్జి, సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు. ఈశిబిరంలో వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ ఆనంద్‌ను సత్కరించారు.

విధులను ఆటంకపరిచిన వారిపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురంలో ఒక వ్యక్తిని బంధించినట్లు 112 నంబరుకు కాల్ రాగా, రూరల్ ఏఎస్సై గోపీనాథ్ తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. చౌదూరి మణికంఠ, మరో కొంతమంది కలిసి గోపీనాథ్ విధులు నిర్వహించకుండా అడ్డగించి దౌర్జన్యం చేశారు. దీనిపై ఏఎస్సై గోపీనాథ్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై జేఎన్‌వీ.ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాసవి, వనిత క్లబ్ సేవలు అభినందనీయం



భవిత సెంటర్‌లో సేవా కార్యక్రమంలో పాల్గొన్న వాసవి, వనిత క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి, వనిత క్లబ్‌లు సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. వాసవి క్లబ్, వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత వాసవి అమ్మవారికి పూజలు, ఐదోవ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో పొట్టి శ్రీరాముల విగ్రహాన్ని ఆవిష్కరించారు. సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. భవిత సెంటర్‌లో పిల్లలకు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బోధన సామగ్రి, డ్రాయింగ్ బుక్స్, పెన్నులు అందజేశారు. అంగన్‌వాడీ సెంటర్ పిల్లలకు టిఫిన్ బాక్స్‌లు, స్నాక్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, వాసవి ఆలయానికి స్టూల్స్, పేద ఆర్యవైశ్య కుటుంబానికి కిరాణా సరుకులు, దివ్యాంగురాలకు మందులు, ప్రొటీన్ ఫుడ్, పండ్లు, పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, మహిళలకు చీరలు, పడాల వృద్ధాశ్రమంలోని గోవులకు దాణా అందజేశారు. జిల్లా గవర్నర్ వలివేటి ప్రసాద్ మాట్లాడుతూ వాసవి క్లబ్ ప్రారంభించి 24 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయమన్నారు. నున్న సుందరరావు, పి.రామారావు, జయవరపు లక్ష్మి, ఆలపాటి అచ్యుతలక్ష్మి, సన్నిధి సూర్యనారాయణ, పులవర్తి రాంపండు, నున్న శ్రీ నాగలక్ష్మి, ఆనంద్, చలంచర్ల రామాంజనేయ గుప్తా, కె.రంగారావు, ప్రత్యేక ఉపాధ్యాయులు బి.జ్యోతి, సత్యవతి తదితరులు హాజరయ్యారు.

నేటి నుంచి హరికథా సప్తాహం



హరికథా సప్తాహంపై కరపత్రాలు విడుదల చేస్తున్న నిర్వాహకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని మహాలక్ష్మి నగర్ రోడ్డు నంబర్ 4లో ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు తృతీయ హరికథా సప్తాహం ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి 9 గంటల వరకు కొనసాగుతాయని వాటిని విజయవంతం చేయాలని నిర్వాహకులు కర్రి ప్రభాకర్ బాలాజీ, కర్రి సుధాకర్ (బుజ్జి), ఆకుల బలరాం కృష్ణ, కొట్టు నరసింహారావు కోరారు. తొలుత నిర్వాహకులు బాలాజీ నివాసం వద్ద సప్తాహ కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సర్వ కళల సమాహారమైన హరికథలను భవిష్యత్తు తరాలకు తెలియజేయాలనే సంకల్పంతో కార్తీక మాసంలో హరికథా సప్తాహానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. వాయిద్య సహకారం శ్రీ సరస్వతుల హనుమంతురావు, వయోలిన్ బీహెచ్‌కే సీతాపతిరావు అందిస్తారని తెలిపారు. సప్తాహ ముగింపు కార్యక్రమంలో భాగంగా 24న ఉదయం 10 గంటలకు దివ్యజ్ఞాన సమాజానికి ఎంతో సేవ చేసిన అనిబిసెంట్ జీవిత చరిత్రపై హరికథ ఉంటుందని, అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తారని వివరించారు.

ప్రజలపై ధరలు, పన్నుల భారం



తణుకులో మాట్లాడుతున్న రాజారామ్మోహన్‌రాయ్

తణుకు: ప్రజలు సమస్యలు పరిష్కారం కావాలంటే వామపక్షాలు అధికారంలోకి రావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. శనివారం స్థానిక అమర వీరుల భవనం వద్ద సీపీఎం 5వ పట్టణ మహాసభ ప్రారంభ సూచికంగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు గారరంగారావు ఆవిష్కరించారు. అధ్యక్ష వర్గంగా అడ్డగర్ల అజయ కుమారి, గుబ్బల గోపి వ్యవహారించిన ఈ కార్యక్రమంలో రాయ్ మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చాక ప్రజలపై పన్నుల, ధరల భారాలు వేయడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం, పేదరికం, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని అన్నారు. వామపక్షాలు అధికారంలోకి వస్తే కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా అభివృద్ధి ధ్యేయంగా పాలన సాగుతుందన్నారు. పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ పలు అంశాలు వివరించారు. అంతకుముందు అమరులైన సీతారాం ఏచూరి, పుచ్చలపల్లి సుందరయ్య, రుద్రరాజు వెంకటస్వామి, తాళ్లూరి మురళీవెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్, కామన మునిస్వామి, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.